క్లుప్తంగా

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

మిలాద్ కమిటీ అధ్యక్షుడు అజారుద్దీన్



రక్తదాన శిబిరంలో కమిటీ సభ్యులు

పరిగి: ప్రతిఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని మిలాద్ కమిటీ అధ్యక్షుడు ఖాజీఖాజా అజారుద్దీన్ సూచించారు. ఆదివారం మహమ్మద్‌ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా మీలాద్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలు కాపాడొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యుడు ఖలీల్, జహంగీర్, సమద్, మౌలానా, ఇబ్రహీం, ముజీబ్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే రెడీమిక్స్ కంకర

ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు



రోడ్డుపై ఉన్న రెడీమిక్స్ సిమెంట్ కంకర

పరిగి: రెడీమిక్స్ కంకరను పారబోస్తూ వెళ్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రూప్‌ఖాన్‌పేట్ సమీపంలో రెడీమిక్స్ వాహనాలు నిత్యం పట్టణ కేంద్రానికి వస్తుంటాయి. సిమెంట్ మిక్స్ చేసిన తర్వాత వాహనాల్లో తరలించే క్రమంలో రోడ్డుపై పడటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోతున్నారు. నియమ నిబంధనలు పాటించకుండా అధిక లోడ్‌తో రోడ్డుపై రాకపోకలు సాగిస్తుండడంతో పట్టణ కేంద్రంలోని ప్రధాన రహదారిపై పలు చోట్ల గుంతలు ఏర్పడుతున్నాయి. ఇష్టానుసారంగా రోడ్లపై సిమెంట్ కంకర వేస్తూ రోడ్లను ధ్వంసం చేస్తున్నాయి. ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్తను తొలగించండి

చెంగోల్ గ్రామస్తుల వేడుకోలు



చెంగోల్ శివాలయ సమీపంలో పేరుకుపోయిన చెత్త

తాండూరు రూరల్: పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్రామంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకపోయింది. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో పాలన అటకెక్కింది. ఇందుకు నిదర్శనం తాండూరు మండలం చెంగోల్ గ్రామంలోని శివాలయ సమీపంలో పేరుకపోయిన చెత్తేనని అన్నారు. చుట్టు పక్కల ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ఆలయ సమీపంలో పడేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చెంగోల్ నుంచి చింతమణిపట్నం, పర్వాతపూర్ గ్రామాలకు వేళ్లే ప్రజలు కూడా ముక్కు మూసుకొని వెళ్లాల్సివస్తోందని చెబుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి శివాలయం సమీపంలోని చెత్తను తొలగించాలని చెంగోల్ గ్రామస్తులు కోరారు.

రైతులందరికీ సరిపడా ఎరువులు

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్

మొయినాబాద్‌రూరల్: రైతులు వేసుకున్న పంటలకు ప్రభుత్వం ద్వారా సరిపడా ఎరువులను సరఫరా చేస్తారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయడంతో విఫలమైందని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పదేపదే మాట్లాడడం సరైంది కాదన్నారు. కేంద్రం ద్వారా వస్తున్న ఎరువులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మండలాల వారీగా పంపిణీ చేస్తోందన్నారు. మొయినాబాద్‌లో రైతులు క్యూలో ఉన్నప్పటికీ వారికి అధికారులు సూచనలు, సలహాలు ఇస్తూ ప్రభుత్వం ద్వారా వచ్చిన ఎరువుల పంపిణీ చేస్తున్నారన్నారు. అధికంగా రైతులు రావడంతో యూరియా బస్తాలు సరిపోక అందరికీ అందలేకపోతోందన్నారు. తిరిగి మళ్లీ స్టాక్ రాగానే అధికారులు వెంటనే పంపిణీ చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న ఈ ఎరువులు రాష్ట్ర ప్రభుత్వానికి ఆలస్యంగా వస్తున్నాయన్నారు. దీనిని రైతులు దృష్టిలో పెట్టుకొని నిరాశకు గురి కావొద్దని సూచించారు. రైతుల ప్రభుత్వం కాంగ్రెస్ అని, వారి సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

కరిచేస్తున్నాయ్..!

- వీధి కుక్కలతో జాగ్రత్త
- చిన్నా, పెద్ద, తేడా లేకుండా గాయాలు
- భయాందోళనలో ప్రజలు
- శునకాల నుంచి రక్షించాలని విజ్ఞప్తి
- పట్టించుకోని అధికారులు



దౌల్తాబాద్‌లో సంచరిస్తున్న వీధి కుక్కలు

దౌల్తాబాద్: మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు కుక్కలతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి కరవడంతో గాయాలపాలవుతున్నారు. చిన్నా, పెద్ద తేడాలేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవి రోడ్ల వెంబడి, వీధుల్లో స్వైరవిహారం చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వీధుల్లో ఒంటరిగా వెళ్లాలంటే జంకుతున్నారు. ఉదయం, సాయంత్రం, పగలు, రాత్రి అనే తేడా లేకుండా గుంపులుగా సంచరిస్తూ ఒంటరిగా ఉండే వారిపై దాడిచేస్తున్నాయి. ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎక్కడి నుంచి వచ్చిదాడులు చేస్తాయోనని భయం..భయంగా మసలుకుంటున్నారు. ఈ విషయంలో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని అంటున్నారు. వీధుల్లో తిరిగుతూ ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తున్నాయి. వాటిని తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి ఘటనలు నిత్యంకృత్యంగా మారాయి.

కొన్ని సంఘటనలు ఇలా..

మండల కేంద్రంలో ఐదేళ్ల బాలుడు ఇంటి ముందే ఆడుకుంటుండగా ఓ కుక్క వీపునకు కరిచేసింది. పక్కనే ఉన్న వారు తరమడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

▲ బాలంపేట గ్రామంలో ఓ విద్యుత్ లైన్‌మెన్ బిల్లులు వసూలు చేస్తుండగా ఇంటి ముందర ఉన్న కుక్క కాలిని కొరికేసింది.

▲ దౌల్తాబాద్‌లోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట రోడ్డుపై ఓ కుక్క ద్విచక్రవాహనానికి అడ్డురావడంతో ఆ వ్యక్తి కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కుక్కలను పట్టుకుని గ్రామాల్లో ప్రజల కష్ట, నష్టాలను తొలగించాలని కోరుతున్నారు.

భయమేస్తోంది



గ్రామంలో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. దీంతో బయటకు వెళ్లాలంటే భయమేస్తుంది. ఇళ్ల ముందు ఆడుకుంటున్న చిన్నారులపై ఎక్కడ దాడి చేస్తాయోనని భయంగా ఉంటోంది. కుక్కల నియంత్రణకు సత్వరమే చర్యలు తీసుకోవాలి

– గోవిందు, దౌల్తాబాద్, స్థానికుడు

రానున్నది బీఆర్ఎస్ పాలన



నూతన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

చౌడాపూర్ యూత్ వింగ్ అధ్యక్షుడు మేగ్యా నాయక్

కుల్కచర్ల: రానున్నది బీఆర్ఎస్ పాలన అని చౌడాపూర్ యూత్ వింగ్ మండల అధ్యక్షుడు మేగ్యా నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా చౌడాపూర్ గ్రామానికి యూత్ వింగ్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మేగ్యా నాయక్ మాట్లాడుతూ.. కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమయ్యేలా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లంటూ నిబంధనలను పెట్టి కేవలం కొద్దిమందికి మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. యువతకు ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల నర్సింలు, ఎరుకలి కృష్ణయ్య, శివకుమార్, దాసు, ప్రభు, నర్సింలు, ముబీన్, మల్లేశం, సత్యయ్య, అంజయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

మండల అధ్యక్షుడు శేఖర్

దుద్యాల్: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆలేడ్‌లో రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లు పరిపాలించిన గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ముఖ్యంగా నూతన గ్రామ పంచాయతీలను గాలికొదిలేశారని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా పనులను చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సీతారాం నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, ఆలేడ్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు ఖాజా, కృష్ణ, శ్రీకాంత్, బొంపలి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

అబద్ధాలు చెబితే నమ్మరు

మండల కాంగ్రెస్ నాయకులు

యాలాల: బీజేపీ నాయకులు మాట్లాడే అబద్ధాలను ప్రజలు నమ్మరని కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా, ఏఎంసీ డైరెక్టర్ గోనేగారి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..గోవిందరావుపేటకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, నూతన స్తంభాలు, విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయించారన్నారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు దీన్‌దయాల్ పథకంలో భాగంగా కరెంటు సమస్య పరిష్కరించినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అంతేకాకుండా 20 ఏళ్ల క్రితం స్థానిక బీజేపీ నాయకుడు యాలాలలో 12 ట్రాన్స్‌ఫార్మర్లు, రైతుల పేరిట డీడీలు కట్టి మంజూరు చేయించారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా ఉన్న నారాయణరావు, రోహిత్‌రెడ్డి హయాంలో యాలాలకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఇటీవల మంజూరు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు స్థానిక నేత పేరి రాజేందర్‌రెడ్డి కృషి ఫలితంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంజూరు చేయించారన్నారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు అబద్ధాలు మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోలు నాగయ్య, గంతల అహ్మద్, న్యాదిర్గి హన్మంతు, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కల్వర్టు నిర్మించి.. ప్రమాదాలు నివారించండి

ధారూరు: మండలంలో రోడ్ల మధ్య ఏర్పాటు చేసిన కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. గతంలో పెద్దరాళ్లు, కంకర, మట్టి వేసి నిర్మించేవారు. వాటికి ఇప్పుడు పగుళ్లు ఏర్పడి, రాళ్లు, మట్టి కొట్టుకపోయి గుంతలు ఏర్పడుతున్నాయి. అక్కడి నుంచి నీరు ప్రవహించడంతో ఆ రోడ్డు పాడైంది. దీంతో కొన్నిసార్లు ఆవైపుగా ప్రయాణించే వాహనదారులు పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని కుక్కింద-కొండాపూర్‌కలాన్ గ్రామాల మధ్య మండల పరిషత్ కార్యాలయం నుంచి ధారూరుకు వచ్చే దారిలో రోడ్లకు అడ్డంగా వీటిని నిర్మించారు. ప్రస్తుతం వీటిపై నుంచి వాహనాలు వెళుతూ ప్రమాదాల బారీన పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి నూతన కల్వర్టులు నిర్మించాలని కోరుతున్నారు.



దెబ్బతిన్న మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు

నేడు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

దుద్యాల్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల ప్రచురణ వంటి విషయాలపై రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహేశ్ కుమార్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

బంట్వారం: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తామని వివరించారు. ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి రాజకీయ పార్టీల నాయకులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఉచిత వైద్య శిబిరం

మొయినాబాద్‌రూరల్: మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నగరంలోని ఏఐజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వైద్య శిబిరాన్ని 9 గంటలకు ప్రారంభించనున్నట్లు, గుండె, కేన్సర్ తదితర స్కానింగ్‌లతో పాటు వివిధ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. దీనిని గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ అంతరాయం

కొత్తూరు: కొత్తూరు 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రమేశ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరు, తిమ్మాపూర్, కొత్తూరు తండా, తిమ్మాపూర్ పారిశ్రామికవాడల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయబడుతుందని, ట్రాన్స్‌కోకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

రైతులకు యూరియా అందించడంలో విఫలం

మొయినాబాద్: రైతులకు సరిపడా యూరియా అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి విమర్శించారు. ఆదివారం మొయినాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యూరియా కోసం ప్రతి రోజు రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. నెల రోజులకుపైగా రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని మండిపడ్డారు. సీజన్‌కు ముందే సరిపడా యూరియాను అందుబాటులో పెట్టాల్సిన సీజన్ దాటిపోతున్నా అందించలేకపోతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ప్రతి రోజు రైతులు ఎరువుల కోసం పీఏసీఎస్‌లు, ఫర్టిలైజర్ షాపుల వద్ద బారులు తీరుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులను మోసం చేస్తో ందని ఆరోపించారు.

విద్యార్థులకు గ్రేడింగ్ పరీక్షలు

కొందుర్గు: మండల కేంద్రంలోని జీఎం పటేల్ గార్డెన్‌లో సోమవారం న్యూమాంక్స్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటేలో పరీక్షలు నిర్వహించి గ్రేడ్‌లను నిర్ధారించారు. ఈ పరీక్షలకు వివిధ మండలాలకు చెందిన 100 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా 20 మంది విద్యార్థులకు గ్రీన్ బెల్ట్, 10 మందికి ఆరెంజ్ బెల్ట్, 10 మంది విద్యార్థులకు ఎల్లో బెల్ట్‌లకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి ఫౌండర్ అండ్ టెక్ డైరెక్టర్ ఖాజాపాషా ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బెల్ట్‌లు, ప్రశంస పత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాస్టర్లు రామ్, సత్యం, యోగేశ్ యాదవ్, బాలకృష్ణ, గిరి, నరేశ్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా పంటలు

- ఎక్కువ విస్తీర్ణంలో పత్తి
- పెరిగిన మొక్కజొన్న సాగు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో సాగు చేస్తున్న మొక్కజొన్న

మోమిన్‌పేట: ఖరీఫ్‌లో ఎక్కువ విస్తీర్ణంలో పత్తిని సాగు చేయగా, గతేడాది కంటే మొక్కజొన్న విస్తీర్ణం ఈ సారి పెరిగింది. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వర్షాధార పంటలలో పత్తి, మొక్కజొన్న పంటలనే పది సంవత్సరాలుగా సాగు చేస్తున్నారు. కూలీల కొరత, అధిక పెట్టుబడులు, అతివృష్టి, అనావృష్టితో పెసర, మినుము, జొన్న పంటల సాగుకు స్వస్తి పలికారు. దీంతో మెట్ట పంటలో ఎక్కువగా పత్తిని సాగు చేస్తున్నారు. పెట్టుబడులు పెరిగినా పంటల కలుపుతీత సమయంలో కూలీలు దొరకక పోయినప్పటికీ కాస్త ఆలస్యంగానైన కలుపు తీస్తుండడంతో పంటకు నష్టం లేదు. కాబట్టి రైతులు దీనికే మొగ్గుచూపుతున్నారు. అదేవిధంగా గతేడాది కంటే ఈ సారి మొక్కజొన్న సాగు పెరిగింది. రెండెకరాలు ఆపై ఉండే, ఇద్దరు లేక ముగ్గురు ఉమ్మడిగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. అడవి పందుల బెడద నుంచి పంటరక్షణకు చుట్టూ సోలార్ ఫెన్సింగ్‌ను ఉపయోగిస్తున్నారు. గతంలో ఇలాంటి సౌకర్యం లేకపోవడంతో అడవి పందుల నుంచి రక్షించుకునేందుకు నానా తంటాలు పడుతుండేవారు. ప్రస్తుతం సోలార్ ఫెన్సింగ్ అందుబాటులో ఉండటంతో మొక్కజొన్నకు ఆసక్తి చూపిస్తున్నారు. ఖరీఫ్‌లో మూడు నెలలుగా వర్షాలు విస్తారంగా కురవడంతో పంటలు ఆశాజనకంగానే ఉన్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో 70శాతం పత్తి, 20శాతం మొక్కజొన్న సాగు చేశారు. మొక్కజొన్నలో అంతర పంటగా కంది వేశారు. 5శాతం వాము పంట వేశారు. ఈ సారి పంటలు మంచిగా రావడం, మొక్కజొన్న కంకులకు విత్తులు బలపడుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి



వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వందన

పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ వందన

దుద్యాల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని హకీంపేట్ పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వందన పేర్కొన్నారు. పోలేపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులు వస్తున్నాయని తెలుసుకొని మూడు రోజులుగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్యశిబిరం నిర్వహించి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జ్వరం, జలుబు, దగ్గు, టైఫాయిడ్ వంటి వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ప్రజలు బాధపడుతున్నట్లు తెలుసుకొని వైద్య శిబిరం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. ఎక్కువగా జ్వరం, జలుబు, దగ్గు వంటి సాధారణ కేసులే నమోదవుతున్నాయని, వారికి తగిన మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ శిబిరం సోమవారం, మంగళవారం కూడా కొనసాగనున్నట్లు ఆమె చెప్పారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

శంకర్‌పల్లి: గత రెండు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పంచాయతీ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికులకు వేతనాలు ఇవ్వకపోతే, వారి జీవితం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. చాలీచాలని వేతనాలతో వారు వెట్టిచాకిరీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రతీ నెల వేతనాలు రాకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. అదేవిధంగా ఈ నెల 16న షాబాద్ మండలం నాగర్‌గూడలోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో నిర్వహించనున్న జిల్లా గ్రామ పంచాయతీ యూనియన్ మహాసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు, నాయకులు మల్లేశ్, యాదయ్య, అమృత, రేఖ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

పన్నుల తగ్గింపుతో ప్రజలకు మేలు

శంకర్‌పల్లి: ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులలో పెద్దఎత్తున మార్పులు చేసి, పన్నులు తగ్గించడం ప్రజలకు ఎంతో మేలుచేసే అంశమని పట్టణ బీజేపీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణ చౌరస్తాలో వారు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, ప్రధాని మోదీకి అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మున్సిపల్, మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, లీలావతి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వదేశీ వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకు ఎన్నో సంస్కరణలు చేపడుతోందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ పాలన కొనసాగిస్తున్నారన్నారు. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాములు, వాసుదేవ్ కన్నా, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పండిత్‌రావు, దండు రామ్మోహన్, నర్సింలు, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్, శ్రీకాంత్‌రెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి చౌరస్తాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మల్లికార్జున కాలనీ అభివృద్ధి కమిటీ ఎన్నిక

షాద్‌నగర్: పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న మల్లికార్జునకాలనీ నూతన అభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా బర్మలి జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా మంచన్‌పల్లి రమేశ్‌గౌడ్, గౌరవ అధ్యక్షులుగా ఆగీరు శ్రీనివాస్, పురుషోత్తం, ఉపాధ్యక్షులుగా కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, బెన్నూరి రాజేశ్, గుర్రంపల్లి మల్లేశ్, కోశాధికారిగా రఘునాయక్, కార్యదర్శులుగా పరమేశ్వర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, మల్లారెడ్డి, హరీశ్, సభ్యులుగా సాయికుమార్, మధుసూదన్, సురేశ్, జగన్, వెంకటేశ్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, మహేశ్, నర్సింలు తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులను కాలనీ వాసులు ఘనంగా సత్కరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తాండూరు రూరల్: తాండూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–2006 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించుకున్నారు. 20 ఏళ్ల తర్వాత అందరూ ఒకేవేదిక వద్ద కలిసి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో చేసిన అల్లర్లు, చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం విద్యా నేర్పిన గురువులు బస్వరాజ్, నారాయణ, మాధవి, శ్రీదేవి, అంజత్, రాములు, మహాంతయ్య, బస్వరాజ్, నారాయణలను శాలువా కప్పి, పూలమాల వేసి జ్ఞాపిక అందజేసి సన్మానించారు. చాలా కాలం తర్వాత అందరూ ఒకచోట చేరి తమ జ్ఞాపకాలను స్మరించుకొని ఆత్మీయత పంచుకున్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు